క్లుప్తంగా

గురుకుల విద్యార్థుల ప్రతిభ


సత్తా చాటిన విద్యార్థులతో అధ్యాపకులు

బుట్టాయగూడెం: తిరుపతి, నిడదవోలులో జరిగిన అండర్ - 19 కబడ్డీ, వాలీబాల్ క్రీడా విభాగాల్లో జీలుగుమిల్లిలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. తిరుపతిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో విశాఖ జిల్లా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్లకు ఫైనల్ మ్యాచ్ జరగగా, పశ్చిమగోదావరి జట్టు రన్నరప్‌గా నిలిచిందని, ఈ జట్టులో కళాశాల విద్యార్థులు కె.ఆరవింద్, ఎస్.పవన్‌కుమార్, కె.శ్రావణ్‌కుమార్, ఎన్.సంతోష్ ఉన్నారని ప్రిన్సిపాల్ ఎం.శివప్రసాద్ తెలిపారు. అలాగే నిడదవోలులో జరిగిన కబడ్డీ పోటీలో మడకం సాయితేజ జాతీయ స్థాయికి ఎంపికై నట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్, ఇన్‌ఛార్జ్ పీడీ, తెలుగు లెక్చరర్ వై.రత్నాకర్, అధ్యాపకులు అభినందించారు.

శ్రీవారి సేవలో మల్లన్న దేవస్థానం ఈఓ


శ్రీవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న శ్రీశైలం దేవస్థానం ఈఓ పెద్దిరాజు దంపతులు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని శ్రీశైలం శ్రీభ్రమరాంబ మల్లిఖార్జున స్వామివార్ల దేవస్థానం ఈఓ దంతులూరి పెద్దిరాజు దంపతులు బుధవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వారు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్వారకాతిరుమల: మండలంలోని పలు గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. ద్వారకాతిరుమలలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి, శ్రీవారి దేవస్థానం వరకు కొత్త 11 కేవీ ఫీడర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ద్వారకాతిరుమల, దొరసానిపాడు, రాళ్లకుంట, సత్తెన్నగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈఈ నరసింహస్వామి తెలిపారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

గోదావరికి జలకళ


గోదావరిలో పెరిగిన వరద నీరు

టి.నరసాపురం: పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌తో మండలంలోని గోదావరి జలకళను సంతరించుకుంది. తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టు డ్యాంలో లోపాలు తలెత్తడంతో గత కొన్ని రోజుల క్రితం నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల గోదావరికి స్వల్పంగా వరద ప్రవాహం పెరిగింది. అలా పోలవరం ప్రాజెక్టు వద్దకు చేరుకున్న నీటిని ప్రాజెక్ట్ గేట్లు నుంచి కాక ఫిష్ లాడర్స్ నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో బ్యాక్‌వాటర్ ప్రభావంతో విలీన మండలాల్లో గోదావరిలో నీటిమట్టం పెరిగినట్టు తెలుస్తుంది. కాగా గోదావరి నీరు పెరగడంతో గోదావరి సమీపంలో పంటలను సాగు చేసుకుంటున్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ గంగాధర్ తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జంగారెడ్డిగూడెం, పరిసర ప్రాంతాల ప్రజలు ప్రయాణ సంబంధిత సమస్యలను, బస్టాండ్‌లో ఏర్పాటు చేయాల్సిన సదుపాయాలపై సలహాలను తెలియజేయాలని కోరారు.

వలస ఆదివాసీలకు పోడు పట్టాలు ఇవ్వాలి

బుట్టాయగూడెం: వలసఆదివాసీలు, గొత్తి కోయలకు కుల సర్టిఫికెట్లు, పోడు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐఎంఎల్ ప్రజాపంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ప్రదర్శన నిర్వహించిన అనంతరం ధర్నా చేసి పీవోకు వినతిపత్రం అందజేశారు. డివిజన్ కమిటీ కార్యదర్శి ఎస్‌కే గౌస్, రాష్ట్రకార్యవర్గ సభ్యులు కెచ్చల రంగారెడ్డి మాట్లాడారు. వలస ఆదివాసీల సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యవైఖరితో ఉన్నాయన్నారు. ఏపీ, తెలంగాణ, ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్‌లలో సుమారు 80 వేల మంది గొత్తికోయలు ఉన్నారన్నారు. పోడు చేసుకుని జీవిస్తున్న వారికి పట్టాలివ్వాలని కోరారు. అలాగే ఎస్టీ కుల ధ్రువీకరణ అందించాలన్నారు.

రానున్న ధర్మయుద్ధంలో వైఎస్సార్ సీపీదే గెలుపు

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- ఉత్సాహంగా గడపగడపకు మన ప్రభుత్వం 200వ రోజు
- బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన జనం


బొర్రంపాలెం అడ్డ రోడ్డు నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ


టి.నరసాపురంలో బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

టి.నరసాపురం: రానున్న ధర్మయుద్ధంలో మరోసారి వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ధీమా వ్యక్తం చేశారు. పోలవరం నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా బొర్రంపాలెం అడ్డరోడ్డు నుంచి టి.నరసాపురం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రధాన సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభకు అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ పేదవాడి కడుపు నిండాలంటే ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని అన్నారు. సంక్షేమ పథకాలు నిరుపేదలకు నేరుగా అందాలన్నా, రైతుకు 9 గంటల విద్యుత్ సరఫరా ఇవ్వాలన్నా, రైతు భరోసా కొనసాగాలన్నా, నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలన్నా, రాష్ట్రానికి పెట్టుబడులు రావాలన్నా, కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నా, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలన్నా జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి అవసరం అని ఉద్ఘాటించారు. రాబోయే ధర్మయుద్ధంలో వైఎస్సార్‌సీపీదే గెలుపన్నారు. ఈ ఎన్నికలు పేదవాడికి, పెత్తందారుడికి మధ్య జరుగుతున్నాయని, ఎన్నికలు ధర్మానికి, అధర్మానికి, న్యాయానికి, అన్యాయానికి జరిగే ఎన్నికలు అన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా 175 సీట్లలో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యం అన్నారు. చంద్రబాబు మాయలోడని, మరోసారి మోసగించడానికి సిద్ధపడుతున్నాడని విమర్శించారు. చంద్రబాబు ఒంటరిగా ఎదుర్కోలేక దత్తపుత్రుడిని కలుపుకున్నారని అన్నారు. పవన్‌కల్యాణ్‌ను అభిమానులు ఛీకొడుతున్నారని, పవన్ సినిమాల్లో హీరో కాని, నిజజీవితంలో విలన్ అని అభివర్ణించారు. జగన్‌మోహన్‌రెడ్డి ఒంటి చేత్తో 151 ఎమ్మెల్యే, 23 ఎంపీ సీట్లు సాధించారని, సింగిల్‌గానే పోటీ చేస్తారన్నారు. పందులు గుంపుగా వచ్చినా సింహం సింగిల్‌గా వస్తుందన్నారు. ర్యాలీ విజయవంతమైన చందంగానే ప్రజాదరణ ఎప్పుడూ ఇలానే ఉండాలన్నారు. పోలవరం గడ్డ వైఎస్సార్‌సీపీ అడ్డాగా అభివర్ణించారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సభకు అధ్యక్షత వహించిన జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు మాట్లాడుతూ యుద్ధం మొదలైందని, ఎన్నికల శంఖారావం టి.నరసాపురం నుంచే ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. ర్యాలీ ప్రారంభానికి ముందు మల్లుకుంటలో జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ బాలరాజును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్‌ను నాయకులు దుశ్శాలువాతో సత్కరించి మొక్కను అందజేశారు. మోటార్‌సైకిల్ ర్యాలీకి అడుగడుగునా ప్రజలు పూలతో బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా టి.నరసాపురంలో గజమాలతో బాలరాజును సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు, ఎంపీపీ దారబోయిన లక్ష్మి, మండల కన్వీనర్ శ్రీనురాజు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, జెడ్పీటీసీలు కె.హేమకుమారి, మొడియం రామతులసి, మల్లం వసంతరావు, ఎంపీపీలు సుంకర వెంకటరెడ్డి, గంజిమాల రామారావు, కారం శాంతి, కొరసా పోశమ్మ, పార్టీ అధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ, గొడ్డటి నాగేశ్వరరావు, శ్రీనివాస గౌడ్, అల్లూరి రత్నాజీరావు, చందా ప్రసాద్, ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజీ, తుమ్మూరి శ్రీనివాసరెడ్డి, గంజిమాల దేవి, దాసరి విష్ణు, దేవరపల్లి ముత్తయ్య, ఉమ్మడి తేజ, ఆయా మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ర్యాలీకి తరలివెళ్లిన జీలుగుమిల్లి నేతలు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): పోలవరం ఎమ్మెల్యేగా తెల్లం బాలరాజు ఐదవ సారి ఎన్నికవ్వడం నల్లేరుపై నడకేనని, నియోజకవర్గ ప్రజలందరిలో ఇదే అభిప్రాయం వ్యక్తం అవుతుందని జీలుగుమిల్లి సొసైటీ అధ్యక్షుడు బొదా శ్రీనివాసరెడ్డి అన్నారు. పోలవరం నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 200 రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా బుధవారం బొర్రంపాలెం అడ్డరోడ్డు నుండి టి.నర్సాపురం వరకు నిర్వహించిన ర్యాలీకి జీలుగుమిల్లి మండలం నుంచి నాయకులు తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చందా ప్రసాద్ ఆధ్వర్యంలో సుమారుగా 40 కార్లు, ఆటోలలో 150 మంది నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. బొదా శ్రీనివాసరెడ్డి పార్టీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జెడ్పీటీసీ మల్లం వసంతరావు, ఎంపీపీ కోర్సా పోసమ్మ, వైస్ ఎంపీపీ సోమగాని శ్రీనివాస్, చిట్టిబొమ్మ శ్రీనివాసరావు, ఘంటసాల గాంధీ, పేరాబత్తుల వినయ్, సిరిబత్తుల భాస్కర్ ,శ్రీపతి సాయి,ఉప్పల రాంపండు,బి.ప్రేమ్ కుమార్, కక్కిరాల చక్రి, రాము, జగదాంబ, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ జయప్రదం

జంగారెడ్డిగూడెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ వైజాగ్‌లో గత వెయ్యి రోజులుగా చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా బుధవారం పట్టణంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. బుధవారం జంగారెడ్డిగూడెం పట్టణంలో పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. పీడీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వినోద్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ సీహెచ్ సురేష్, పీవైఎల్ డివిజన్ సహాయ కార్యదర్శి టి.బాబురావు, ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే సమస్య ఉండదని ఎంత మొత్తుకున్నా పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం ఏకంగా ప్రైవేటు వ్యక్తులకు విక్రయించాలని ప్రయత్నించడం సిగ్గుచేటు చర్య అన్నారు. విభజన హామీలలో భాగంగా కడపలో పరిశ్రమను నెలకొల్పి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ నాయకులు వి.నాగేంద్ర, పీవైఎల్ డివిజన్ నాయకులు కె.పోతిరెడ్డి, ఏఐవైఎఫ్ నాయకులు పి.జయరాజ్, నాగరాజు, దుర్గారావు, కృష్ణ, ఎస్ఎఫ్ఐ నాయకులు యశ్వంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ మరోసారి సీఎం కావాలని ప్రజాచైతన్య యాత్ర


ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఎమ్మెల్యే తెల్లం బాలరాజును కలుసుకున్న జయకుమార్

జంగారెడ్డిగూడెం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని కోరుకుంటూ జగనన్న రాష్ట్ర అభిమాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కావూరి జయకుమార్ 100 రోజుల ప్రజాచైతన్య యాత్రను చేపట్టారు. ఈ యాత్ర మంగళవారం రాత్రి జంగారెడ్డిగూడెం చేరుకుంది. బుధవారం జంగారెడ్డిగూడెం పట్టణంలో ప్రజాచైతన్య యాత్ర నిర్వహించి, అనంతరం నరసన్నపాలెం మీదుగా కొయ్యలగూడెం చేరుకుని అక్కడ యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తిన చిన్న, గెద్దాడ శ్రీను, అబ్బాస్, మున్సిపల్ కౌన్సిలర్‌లు ఉగ్గం ప్రసాద్, నేకూరి కిషోర్, కొయ్యలగూడెంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఎంపీపీ గంజిమాల రామారావు తదితరులను కలుసుకుని యాత్ర విషయాలను తెలియజేశారు. జయకుమార్ మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఘాట్ (ఇడుపులపాయ) నుంచి జగనన్న సంకల్ప పాదయాత్ర పైలాన్(ఇచ్ఛాపురం) వరకు ప్రజాచైతన్యయాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 12న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించానని, నేటితో 56 రోజులు పూర్తయ్యాయన్నారు. ఇప్పటి వరకు 14 జిల్లాల్లో చైతన్యయాత్రను ముగించుకుని 15వ జిల్లాగా ఏలూరు జిల్లాలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం యాత్ర జంగారెడ్డిగూడెం చేరుకుందన్నారు. తాను చేపట్టిన ఈ యాత్రలో ప్రజా స్పందన బాగుందన్నారు. నాడు బీఆర్ అంబేద్కర్ ఎలా అయితే పేద బడుగు బలహీన వర్గాల కోసం కృషిచేశారో, అంతకు మించి జగనన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సమున్నత స్థానం కల్పిస్తున్నారన్నారు. అటువంటి జగనన్నను మరల ముఖ్యమంత్రి చేసుకోవటం అందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో విజయఢంకా మోగిస్తుందని ఆకాంక్షించారు. కాగా తన యాత్ర డిసెంబర్ 21న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం నాటికి ఇచ్ఛాపురం చేరుకుని ముగిస్తానన్నారు. మొత్తం 4000 కిలోమీటర్లు ప్రయాణించనున్నట్లు వివరించారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం


కామవరపుకోటలో రైతులకు జలకళ మోటార్లను అందజేస్తున్న జెడ్పీటీసీ కడిమి రమేష్

కామవరపుకోట: రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు కడిమి రమేష్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ జలకళ మోటార్లను లబ్ధిదారులైన రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా, ప్రభుత్వం వైఎస్సార్ జలకళతో ఉచిత బోర్లు వేయించి, రైతు భరోసా పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసి అనేక రాయితీలతో, ఎరువులు విత్తనాలు అందిస్తుందని తెలిపారు. ఈ ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో కరిపోతు అనూష, ఉప సర్పంచ్ మెదూరి రంగబాబు, రాష్ట్ర ముతరాజు సంఘ డైరెక్టర్ చిక్కుల శ్రీను, సొసైటీ అధ్యక్షుడు సాయన కనకరాజు, ఎంపీటీసీలు పోలిమెట్ల ప్రశాంత్, కన్నా మేడంకి చిన్న, ఏపీవో నాగరాజు రైతులు పాల్గొన్నారు.

సులభతరంగా రవాణా శాఖ సేవలు


మాట్లాడుతున్న డీటీసీ శాంతకుమారి

జంగారెడ్డిగూడెం: రవాణా శాఖ సేవలను సులభంగా పొందేందుకు అధునాతన సాంకేతికతను వినియోగిస్తున్నట్లు ఏలూరు ఉపరవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి తెలిపారు. బుధవారం స్థానిక ఆర్టీవో కార్యాలయంలో నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. అపరాధ తనిఖీ రుసుము లక్ష్యాలను తప్పనిసరిగా చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రవాణా శాఖ తరుపున అన్ని సేవలను క్యాస్‌లెస్‌గా నిర్వహిస్తున్నామన్నారు. పారదర్శకంగా మధ్య దళారీలు లేకుండా పూర్తిగా ఆన్‌లైన్ విధానాన్ని పాటిస్తున్నట్లు వివరించారు. ప్రతి దరఖాస్తు స్థితి మొబైల్ యాప్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఇక జిల్లాలో స్కూల్ బస్సులపై ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలు అతిక్రమించిన బస్సులపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశామని, జరిమానాతో పాటు అవసరమైతే సీజ్ చేయాలని సూచించినట్లు చెప్పారు. సాంకేతిక వినియోగంతో పారదర్శకత సేవలు అందించడంలో రాష్ట్రం దేశంలోనే నెంబర్‌గా ఉందన్నారు. ఆర్టీవో ఎండీ మదాని, ఎంవీఐలు కేవీ శివప్రసాద్, కె.విజయరాజు, ఏఎంవీఐ వి .ప్రవీణ పాల్గొన్నారు.

15న భద్రాద్రి రామయ్య కల్యాణం


గురవాయిగూడెం అయ్యప్ప క్షేత్రంలో కరపత్రాలను ఆవిష్కరించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: ఈనెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్న శ్రీ భద్రాచలం సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవాలకు భక్తులు తరలి రావాలని భద్రాచలం రామాలయం అర్చకులు రామకృష్ణ ప్రసాద్ కోరారు. గురవాయిగూడెం శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కల్యాణ మహోత్సవాలకు సంబంధించి బుధవారం క్షేత్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అర్చకులు రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ 14న జంగారెడ్డిగూడెంలో భద్రాద్రి రామయ్య రథోత్సవం ప్రారంభమై పురవీధుల గుండా గుర్వాయిగూడెం అయ్యప్ప క్షేత్రానికి చేరుకుంటుందన్నారు. 15న ఉదయం 9 గంటలకు అయ్యప్ప స్వామి వారి దేవస్థానంలో సీతారాముల వారి కల్యాణం నిర్వహిస్తామన్నారు. భక్తులు తరలివచ్చి స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించాలని అర్చకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ కేసరి రామిరెడ్డి, అయ్యప్ప ఛారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ తమ్మన వెంకటేశ్వరరావు, గంగు జగన్మోహనరెడ్డి, కొర్లేపర కృష్ణారావు, పోలు మాల్యాద్రిరెడ్డి, బాకి శ్రీనివాసరెడ్డి, కూనా పార్వతి, ఈమని శశికుమార్, రాజాన సత్యనారాయణ, చిన్ని రామ సత్యనారాయణ, దల్లి చంద్రశేఖరరెడ్డి, దల్లి రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలి


అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: అమరవీరుల ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నాయకులు పోరండ్ల శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రామనరసాపురం గ్రామంలో అమరుల స్థూపం వద్ద అమరవీరుల వారోత్సవం బుధవారం నిర్వహించారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కురుసం లత అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న చట్టాలను పాలకవర్గాలు మార్చివేస్తూ హక్కులను హరించి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల పరిరక్షణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సీనియర్ గ్రామ కమిటీ నాయకులు వేట్ల లచ్చిరెడ్డి, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు కుర్ల నాగలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

14 నుంచి కార్తీక మాసోత్సవాలు


విజయదుర్గ అమ్మవారి ఆలయంలో కార్తీక మాసోత్సవాల కరపత్ర ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీవిజయదుర్గ సహిత శ్రీపంచభూత మరకత లింగేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి కార్తీక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ శ్రీ మారిశెట్టి రాధాకృష్ణ తెలిపారు. బుధవారం ఆలయంలో కార్తీక మాసోత్సవాలు కరపత్రాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఈమని శశికుమార్, కనపర్తి లక్ష్మీనరసింహ ధనకుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రతిరోజు ఉదయం అర్చనలు, అభిషేకాలు, సాయంత్రం లలితా సహస్ర పారాయణం అనంతరం కార్తీక పురాణము పఠన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 20వ తేదీన ఉదయం 8 గంటలకు శ్రీ పంచభూత మరకత లింగేశ్వరస్వామికి, పార్థివ శివలింగానికి 12 రకాల విశేష ద్రవ్యాలతో ఏకాదశ రుద్రాభిషేకం, 26వ తేదీ రాత్రి 7 గంటలకు జ్వాలాతోరణం, 27న లక్ష బిల్వార్చన, డిసెంబర్ 4న శివ పార్వతుల కల్యాణం, 11న జ్యోతిర్లింగ సహిత లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ శాశ్వత కమిటీ ప్రధాన కార్యదర్శి మాడా రామమోహన్‌రావు, కర్పూరం తుకారం, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుడిమెట్ల యుగంధర్, ఉపాధ్యక్షుడు వందనపు అప్పలరాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యర్రం ఉదయ్ కుమార్, మహిళా కమిటీ ఉపాధ్యక్షుడు చిన్ని జయ తదితరులు పాల్గొన్నారు.

అవశేషాలు లేని పంటలు పండించాలి

బుట్టాయగూడెం: వర్జీనియా పంటలో అవశేషాలు లేకుండా పండించాలని రైతులకు జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-1 ఆక్షన్ సూపరింటెండెంట్ బి.శ్రీహరి సూచించారు. రెడ్డిగణపవరంలో బుధవారం వర్జీనియా పొగాకు పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత సీజన్ వర్జీనియాకు బాగా కలిసొచ్చిందని తెలిపారు. రికార్డు ధరలు నమోదయ్యాయని, అయితే ఇదేవిధంగా వచ్చే సీజన్ ఉంటుందని రైతులు భావించవద్దన్నారు. నాణ్యమైన పంటను బోర్డు నిర్దేశించిన మేరకు మాత్రమే పండించాలన్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితి వల్ల పొగాకు పంటలో వచ్చే వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. ఫీల్డ్ అధికారి అరుణ్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ బుచ్చయ్య, బి.కుమార్, బి.ఠాగూర్, రైతులు యాండ్ర ముత్తయ్య, యాండ్ర రవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలరాజుకు వినతి

కొయ్యలగూడెం: జంగారెడ్డిగూడెం ప్రాంతీయ పశువైద్య కేంద్రం ఏలూరు డివిజన్‌లోనే కొనసాగించాలి అని కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం పశు వైద్య సిబ్బంది ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం ప్రాంతీయ పశు వైద్య కేంద్రం నూజివీడు డివిజన్‌లోకి మార్చారని, దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. జంగారెడ్డిగూడెం ప్రాంతీయ పశు వైద్య కేంద్రం ఏలూరు డివిజన్‌లో ఉండడం వల్ల 55 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుందని, దీనివల్ల రాకపోకలు వీలవుతాయన్నారు. కానీ నూజివీడులో కలపడం వల్ల 150 కిలోమీటర్లు దూర ప్రయాణం భారం అవుతుందని వారు తెలిపారు. ఔషధాలు, పరికరాల రవాణాకు, నెలవారీ సమీక్షకు హాజరయ్యేందుకు సిబ్బంది వ్యయప్రయాసలకు గురవుతున్నారన్నారు. సమస్యను పశుసంవర్ధక శాఖ, అగ్రికల్చర్ ఉన్నతాధికారులకు విన్నవించామని, ఎమ్మెల్యే బాలరాజు కూడా తమకు సహకరించాలని వారు కోరారు.

నేటినుంచి 'పల్లెకు పోదాం'

ద్వారకాతిరుమల: పల్లెకు పోదాం.. కార్యక్రమాలు గురువారం నుంచి మండలంలో ప్రారంభం కానున్నట్టు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. అందులో భాగంగా ఈనెల 9న ఐఎస్.రాఘవాపురం, 10న నారాయణపురం, 14న ఎం.నాగులపల్లి, 15న రాళ్లకుంట, 16న సీహెచ్ పోతేపల్లి, 17న జాజులకుంట, అలాగే 20న దొరసానిపాడు, 21న ద్వారకాతిరుమల-1, 22న ద్వారకాతిరుమల-2, 23న జి.కొత్తపల్లి గ్రామాల్లో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పల్లెకు పోదాం కార్యక్రమాలు వేదిక కానున్నాయని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు.

కుక్కునూరు: పల్లెకు పోదాం కార్యక్రమాన్ని ఈనెల 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీ మారేడుబాక, 10న గొమ్ముగూడెం, 14న దాచారం, 15న అమరవరం, 16న పెదరావిగూడెం, 17న శ్రీధరవేలేరు, 20న తొండిపాక, 21న ఉప్పేరు, 22న వింజరం, 23న కుక్కునూరు-1లో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కొయ్యలగూడెం: పల్లెకి పోదాం కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో ఆర్‌బేబీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో అమలు చేస్తామన్నారు. 9వ తేదీన కన్నాపురం-2, 10న కన్నాపురం-1, 14న గవరవరం-2, 15న గవరవరం-1, 16న దిప్పకాయలపాడు, 17న బోడిగూడెం, 20న బయ్యనగూడెం-2, 21న బయ్యనగూడెం-1, 22న అచ్యుతాపురం, 23న సరిపల్లి గ్రామాలలో మొదటి విడతగా నిర్వహిస్తామని తెలిపారు.

నిర్ణీత సమయంలో మందులు పిచికారీ చేయాలి


తొండిపాకలో మిరప పంటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

కుక్కునూరు: నిర్ణీత సమయంలో సరైన మందులు పిచికారి చేయడం ద్వారా మిరప పంటలో తెగుళ్లు పురుగుల చీడను నివారించవచ్చని ఉద్యానవన శాఖ అధికారి నవీన పేర్కొన్నారు. బుధవారం ఆమె మండలంలోని తొండిపాక గ్రామంలో మిరప పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. మొక్క మంచిగా ఎదిగేందుకు 19-19-19 నీ ఒక లీటర్ నీటిలో 5 గ్రాములు లేదా హ్యుమిక్ యాసిడ్ లీటర్ నీటిలో 5 గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. వేరు కుళ్లుకు కోవర్ ఆక్సీక్లోరైడ్ నీ మొక్క మొదట్లో పిచికారి చేయాలని, ఆకుపచ్చ తెగులుకు ప్లాంటో మైసిన్‌ను పిచికారి చేయాలని సూచించారు. ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

సేంద్రియ పంటలు ఆరోగ్యానికి మేలు

బుట్టాయగూడెం: సేంద్రియ పద్ధతిలో పండించిన పంటలు ఆరోగ్యానికి మేలు అని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సీహెచ్ వెంకటేష్, కె.చలపతి అన్నారు. బుధవారం ఐటీడీఏ వద్ద ఏర్పాటు చేసిన అమ్మకాల దుకాణాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అన్ని విధాలుగా మేలు చేస్తుందని, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించే కూరగాయలను ఐటీడీఏ ద్వారా మార్కెట్ చేయడం జరుగుతుందని తెలిపారు.

విర్డ్‌లో కాలిపర్స్, కృత్రిమ అవయవాల అందజేత

ద్వారకాతిరుమల: పోలియో సెరిబ్రల్ పాల్సీ వ్యాధితో బాధపడుతున్న రోగులకు స్థానిక విర్డ్ ఆస్పత్రిలో ఉచితంగా కాలిపర్స్, కృత్రిమ అవయవాలను అందజేస్తున్నట్టు ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరుకు చెందిన గుప్తా ఫౌండేషన్ సహకారంతో కాలిపర్స్‌తో పాటు, చేతులు, కాళ్లు లేని వారికి కృత్రిమ అవయవాలను అందిస్తున్నట్టు చెప్పారు. సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు విర్డ్ ఆస్పత్రిలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. వివరాలకు సెల్ నెంబర్ 83744 45108కు సంప్రదించాలని కోరారు.